# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

శుక్రవారం,మార్చి,27,2026 పేజీలు : 8


## అల్వాల్‌లో ఏప్రిల్ 1న చికెన్ షాపుల బంద్ కు పిలుపు

అల్వాల్, మార్చి 26 (ప్రజాదర్బార్) : చికెన్ షాప్ ఓనర్స్ పై మార్జిన్ కోత విధించినందున, చికెన్ కంపెనీల యాజమాన్యపు చర్యలను ఖండిస్తూ, పూర్వ మార్జిన్‌ను పునరుద్ధరించాలని అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం ఆల్వాల్ లోని చికెన్ షాప్ అల్వాల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 1 తేదీన అల్వాల్ పరిధిలోని అన్ని చికెన్ షాపులు, కంపెనీ అవుట్‌లెట్లతో సహా బంద్ చేయాలని నిర్ణయించారు. చికెన్ కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆశిస్తున్నామని, లేకపోతే ఆందోళనను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

# భద్రాద్రి తరహాలో కరీంనగర్ మహాశక్తి ఆలయంలో..

## అంగరంగ వైభవంగా సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు సన్నాహాలు

**- అత్యంత సుందరంగా ఆలయం ముస్తాబు-భద్రాద్రి తరువాత ఆ స్థాయిలో ఏర్పాట్లుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం -ఒకేసారి 25 వేల మందికి అన్న ప్రసాదాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు-భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు, కూలర్ల ఏర్పాటు-భక్తులు వీక్షించేందుకు ఎల్ ఈడీ స్క్రీన్లను ఏర్పాటు-మజ్జిగను అందుబాటులో ఉంచిన ఆలయ నిర్వాహకులు-ఉదయం 9 గంటల నుండి శ్రీరామ నవమి వేడుకలు-నవమి వేడుకల్లో పాల్గొననున్న బండి సంజయ్ దంపతులు-సీతారామచంద్రుడి పెళ్ళికి పెద్ద ఎత్తున తరలిరావాలని కేంద్ర మంత్రి పిలుపు**





ప్రజాదర్బార్, కరీంనగర్ : తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు పేరు వినగానే ఠక్కున భద్రాచలం గుర్తుకొస్తుంది. అత్యంత అంగరంగ వైభవంగా భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి దంపతుల పెళ్లి వేడుకలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు ఆ పెళ్లి వేడుకలను స్వయంగా వీక్షించేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా భద్రాద్రి వెళతారు. ఇప్పుడు భద్రాద్రి తరువాత ఆ తరహాలో సీతారామచంద్రస్వామి వేడుకలు జరిపేందుకు కరీంనగర్ వేదికగా మారింది. సాధారణ ప్రజలు నిర్వహించే పెళ్లి వేడుకల తరహాలోనే కరీంనగర్ లో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్యభారతి స్వామీజీ ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన శ్రీ మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పెళ్లంటే పందిళ్లు, తప్పట్లు, తాళాలు, తలంబ్రాలు అనే నానుడిని నిజం చేస్తూ అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇక తప్పట్లు, తాళాలు సరేసరి. ఒకేసారి 25 వేల మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్లను అమర్చారు. సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్ధమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్య మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు. రామయ్య–సీతమ్మ పెళ్లి వేడుకల కోసం శ్రీ మహాశక్తి ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేస్తున్నారు. తీరొక్క పూలతో దేవాలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. విద్యుత్ కాంతులతో ధగధగలాడేలా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన పెళ్లి పందిరిని ఏర్పాటు చేసి పూలతో అలంకరిస్తున్నారు. ఎండాకాలం కావడంతో నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు, చిన్నారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు. శ్రీ మహాశక్తి ఆలయంలో సీతమ్మ–రామయ్య పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన, ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 25 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికీ సరిపడా భోజనాలు, ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. పెళ్లి సమయంలో ఏ విధంగా భోజనాలను సిద్ధం చేస్తారో... అదే తరహాలో మూడు రకాల కూరలు, సాంబార్, పెరుగు, స్వీట్, పులిహోర సహా ప్రత్యేక వంటకాలను వడ్డించేందుకు సిద్ధమయ్యారు. భక్తులకు భోజన సమయంలో క్యూ కట్టే పనిలేకుండా 5 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక వంటశాలను ఏర్పాటు చేసి ఈరోజు రాత్రి నుండే వంటలు ప్రారంభించనున్నారు. కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శ్రీరామ నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరికీ వేదపండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.





# కొర్ర తండా అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి



మాడ్గుల మార్చి26(ప్రజాదర్బార్) కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా మాడుగుల మండల మాజీ వైస్ ఎంపీపీ కోర్ర శంకర్ నాయక్, కోర్ర తండా ఉపసర్పంచ్ కోర్ర బాలునాయక్ కలిసి గ్రామ సమస్యల పరిష్కారం కోసము వినతి పత్రం అందజేశారు. తండా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నందున కొత్తగా రోడ్లను మంజూరు చేయించాలని,తండాలో సిసి రోడ్లు మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శంకర్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తండావాసులు కొర్ర లక్ష్మణ్ నాయక్, జవహర్లాల్, బంకట్లాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నాచారం శాంతి గార్డెన్స్ అపార్ట్మెంట్ లో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న మహిళలు



– నాచారం, మార్చి 26( ప్రజాదర్బార్ ) నాచారం లోని శాంతి గార్డెన్స్ అపార్ట్మెంట్ లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి మహిళలు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిపేందుకు నాచారం లోని శాంతి గార్డెన్స్ అపార్ట్మెంట్ వాసులు భక్తులు, కళ్యాణ మం డపాన్ని తోరణాలు, విద్యుద్దీపాలతో అలకరించారు. ఒక కుటుంబం సీత అమ్మవారిని పెళ్ళికూతురు చేయగా మరో కుటుంబం రాములవారిను పెళ్ళి కొడుకు గా సిద్ధం చేశారు. పెళ్లి వేడుకల్లో నిర్వహించే పసుపు దంచడం, ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కళ్యాణోత్సవం మరింత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# నిర్మల్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నిర్మల్, మార్చి 26(ప్రజాదర్బార్, ప్రతినిధి)నిర్మల్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం నిర్మల్ పట్టణంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ ఎన్నికలలో బర్ల శుభకరన్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి న్యాయవాది వోస మహేందర్ సహాయ ఎన్నికల అధికారి వంగ శ్యామ్ సుందర్ రెడ్డి లు ప్రకటించారు. ఉపాధ్యక్షునిగా అబ్బిడి నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కటకం అజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఆర్ రత్నం, కోశాధికారిగా చిన్నబోని అర్చన, కల్చరల్ సెక్రటరీగా పి వంశీ, గ్రంథాలయ కార్యదర్శిగా కే నివేదిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో.



మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (డోర్నకల్) మార్చి 26 (ప్రజాదర్బార్): పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అంచనాలకు అనుగుణంగా ఆదాయాన్ని పెంచుకోవాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని సూచించారు. వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించి, అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సోలార్, ఎలక్ట్రికల్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌల లభ్యత మరియు ధరలపై వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలు ఉంటే, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీతో కలిసి సూచించారు. ఈ సమావేశంలో డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ నిరంజన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్ఐ సంతోష్... కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా..





ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి మార్చి26:తాంసీ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ)గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మరణించిన మడపాచీ సంతోష్ కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం పరామర్శించారు. భీంపూర్ మండలం కరంజి (టి) గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ప్రభుత్వం తరపున ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, భీంపూర్, తాంసి తహసీల్దార్లు రమేష్, లక్ష్మీ, కలెక్టరేట్ ఏవో వర్ణ, రెవెన్యూ అధికారులు కార్తీక్, రాజేశ్వర్, కుటుంబ సభ్యులు సంగీత, చంద్ర శేఖర్, రుతిక్, తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉద్యమ ఫలితమే .. బోథ్ అగ్నిమాపక కేంద్రం..

బోథ్, ప్రజాదర్బార్, మార్చ్ 26: వేసవి కాలం రాగానే అగ్నిప్రమాదాల భయంతో బోథ్ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందేవారు. ముఖ్యంగా గత మూడు సంవత్సరాల క్రితం బోథ్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వరుసగా జరిగిన అగ్నిప్రమాదాలు ప్రజలను మరింత భయాందోళనలకు గురిచేశాయి. ఈ పరిస్థితిని గమనించిన బోథ్ యువత, ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని సంకల్పించి పలు రాస్తారోకాలు, ధర్నాలు, ఉద్యమాలు చేపట్టారు. ఆ సమయంలో యువత పోరాటాన్ని అణచివేయడానికి కేసులు నమోదు చేయడం కూడా జరిగింది. ఆ కేసుల కోసం యువత గత మూడు సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. తమ వ్యక్తిగత భవిష్యత్తును పక్కనబెట్టి, ప్రాంత అభివృద్ధి కోసమే యువత నిరంతరం పోరాటం చేసింది. ఈ ఉద్యమ ఫలితంగానే బోథ్‌లో అగ్నిమాపక కేంద్రం మంజూరు అయింది. అయితే, ప్రస్తుతం కొందరు నాయకులు ఈ కేంద్రాన్ని తామే మంజూరు చేయించామని చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఈ విజయానికి కారణం యువత చేసిన ఉద్యమమే అని ప్రజలకు స్పష్టంగా తెలుసు. బోథ్ యువతకు గొప్పలు అవసరం లేదు. తమ ప్రాంత అభివృద్ధి మాత్రమే లక్ష్యమని వారు స్పష్టం చేస్తున్నారు.

# అత్యవసరంలో ఆదిలాబాద్ 108 సేవలు అమోఘం..

## ప్రాణాలను కాపాడుతున్న ఆదిలాబాద్ 108 పైలట్ లు..

## రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన అత్యవసర సేవా వ్యవస్థ...

ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి మార్చి26: ఆదిలాబాద్ జిల్లా 108 అత్యవసర అంబులెన్స్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తూ, ప్రాణాలను కాపాడే యజ్ఞంలో అద్భుతమైన సేవలను అందిస్తున్నాయి. ప్రతి క్షణం విలువైన అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనతో ప్రజలకు నమ్మకంగా నిలుస్తూ, 108 సేవలు తమ ప్రత్యేక గుర్తింపును మరింత బలపరచుకున్నాయి. మార్చి 2025 నుండి ఫిబ్రవరి 2026 వరకు మొత్తం 30,414 కేసులను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఈ బృందం తన సేవా నిబద్ధతను చాటింది. ఇందులో ప్రాణాపాయ స్థితుల్లో ఉన్న రోగులకు అత్యంత వేగంగా స్పందించడం గమనార్హం.

- ట్రామా (నాన్–వాహన ప్రమాదాలు): 1747
- కార్డియాక్ అత్యవసరాలు: 2125
- పాయిజనింగ్ కేసులు: 1164
- కన్వల్షన్స్ (ఫిట్స్): 1051
- ఆత్మహత్యాయత్నాలు: 491
- స్ట్రోక్ (ప్యారాలిసిస్): 218
- జంతువుల దాడులు: 574
- అగ్ని ప్రమాదాలు/బర్న్స్: 60

గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదు ఇవి వేలాది కుటుంబాలకు తిరిగి ఆశను అందించిన



జీవ రక్షణ గాథలు. జిల్లా కలెక్టర్ తో పాటు ఐవీఎా మార్గదర్శకత్వంలో 108 సేవలు మరింత సమర్థవంతంగా అమలవుతూ, ప్రతి కేసులో ప్రాణాలను కాపాడే దిశగా పనిచేస్తున్నాయి. ఈ విజయానికి ప్రధాన స్తంభాలుగా నిలిచిన 108 జిల్లా మేనేజర్ సురం శేఖర్, ప్రోగ్రామ్ మేనేజర్ సమ్రాట్, తమ సమర్థ నాయకత్వంతో సేవలను కొత్త స్థాయికి తీసుకెళ్లారు. వారి పర్యవేక్షణ, కట్టుదిట్టమైన ప్రణాళికలు, టీమ్‌పై ఉన్న పట్టుదల వల్ల ఆదిలాబాద్ జిల్లా 108 సేవలు రాష్ట్రంలోనే ఉత్తమ పనితీరును కనబరుస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన,ఆనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో బాధితులు 108 ను సంప్రదిస్తే చాలు క్షణాల్లోప్రత్యేకంగా పైలట్లు, జుమీలు తమ ప్రాణాలను పణంగా పెట్టి, రాత్రింబవళ్లు సేవలందిస్తూ, ప్రతి కాల్‌ను ప్రాణ రక్షణ అవకాశంగా తీసుకుంటున్నారు. వారి అంకితభావం, సేవా స్ఫూర్తి వల్లే ఈ విజయ గాథ సాధ్యమైంది."ప్రతి కాల్ ఒక ప్రాణం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఆదిలాబాద్ 108 సేవలు, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలతో రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలిచాయి.

# ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం

## మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

### ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

మెదక్ ప్రతినిధి, మార్చి 26: (ప్రజాదర్బార్) రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ టౌన్ పరిధిలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో 'ూతీతీఅజవ ూశ్రీఅజవ' మూడో విడత కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులకు, యువతకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు గాయాలు తగ్గి ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్ వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఓవర్‌టేకింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు.వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, ప్యూసీ (ాఖజ) వంటి అవసరమైన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలనుగణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజల సహకారం ఉంటేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ ఇన్స్పెక్టర్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# విజ్ఞన్న మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు



ప్రజాదర్బార్ ప్రతినిధి/జనగామ : జనగామ జిల్లా సీనియర్ జర్నలిస్టు రచ్చ విజయ్ కుమార్ పత్రికారంగానికి చేసిన సేవలు మరువలేని పలువురు జర్నలిస్టులు అన్నారు.విజయ్ కుమార్ (75) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. జనగామకు చెందిన సీనియర్ జర్నలిస్టులు నల్ల లక్ష్మీపతి,మాదంశెట్టి వేణుమాధవ్ గుప్తా,చింతకింది కృష్ణమూర్తి, మన చౌరాస్తా ఎడిటర్ ఉప్పలంచి నరేం దర్ గురువారం హైదరాబాద్ లోని విజయ్ కుమార్ స్వగృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు వివిధ దినపత్రికల్లో పనిచేసి విజ్ఞన్న అధికారులు,ప్రజాప్రతి నిధులతో పాటు అన్ని వర్గాల ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.ఆయన మృతి జర్నలిస్ట్ లోకానికి తీరనిలోటు అని అన్నారు.ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు బంధువులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# శ్రీ నల్ల పోచమ్మ హుండీ ఆదాయం 7 లక్షల 42, వేలు

కౌడిపల్లి, మార్చి 26:( ప్రజా దర్బార్) మెదక్ జిల్లా కౌడిపల్లిమండల పరిధిలోని తునికి గ్రామ శివారులోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం హుండీ ఆదాయం రూ 4 లక్షల,42 వేల,12 రూపాయలు వచ్చినట్లు ఈఓ రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో రంగారావు మాట్లాడుతూ ఆలయం వద్ద గురువారం కుచన్ పల్లి కూచాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థానము కార్యనిర్వహణ అధికారి వెంకట యోగి శ్రీనివాస్, ఈవో రంగారావు ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శివప్ప ,, రాజేష్ విగ్నేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 75 రోజుల కు సంబంధించి అధికారులు, పోలీసులు, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సిరిసిల్ల ,భక్తుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించాగా. రూ 4 లక్షల,42వేల,12 రూపాయలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఆదాయాన్ని దేవాదయ శాఖ బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూదన్ గౌడ్, కుచన్ పల్లి కూచాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థానము ఈవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,సభ్యులు, ప్రభాకర్ చారి, రాజా శేఖర్ ,సభ్యులు ,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ లు బండ సాయ గౌడ్ ,చల్ల మల్లేశం ,పోలీస్ సిబ్బంది ప్రవీణ్, శోభారాణి, మాజీ సర్పంచ్ లు గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది రాజు, అశోక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మేటలో ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతం

చేవెళ్ల, మార్చి 26(ప్రజాదర్బార్ ): మండలంలోని కమ్మేట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యం లో నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం ఉత్సాహభరితంగా, సేవా భావంతో విజయవంతంగా ముగిసింది. శిబిరంలో పాల్గొన్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు జెడ్పీహెచ్ఎస్ (గ్రామీ) పాఠశాల, శివాలయ పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. "నాట్ మీ, బట్ యూ" అనే ఎన్.ఎస్.ఎస్ సూక్తిని ఆచరణలో చూపించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎం. రమేష్ బాబు ఆహ్వానం మేరకు శ్రీ దయానంద ఆర్య వాలంటీర్లకు విస్తరణ ఉపన్యాసం ఇచ్చారు. "యువతే దేశ దీప్తి" అనే అంశంపై మాట్లాడిన ఆయన దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సత్యనిష్ఠ, సద్గుణాలు అలవరచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్య, పట్టుదల, స్వీయ నియంత్రణ, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించిన ఆయన నిర్లక్ష్యం, అసంయమం వల్ల కలిగే ప్రతికూల ఫలితాలపై



హెచ్చరించారు. సమానత్వ సమాజ నిర్మాణానికి ఐక్యత, దయా భావం అవసరమని తెలిపారు. ఆత్మనిర్భరత, పరసేవ వంటి విలువలను జీవితంలో అవలంబించాలని పిలుపునిచ్చారు. శిబిరంలో డా. ఎన్. విజయలక్ష్మి, శ్రీమతి ఎ. కవిత, శ్రీమతి విష్ణుప్రియ పాల్గొని వాలంటీర్లను ప్రోత్సహించారు. సేవా కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రేరణాత్మకంగా మాట్లాడారు. శిబిరం ముగింపులో వాలంటీర్లలో కొత్త ఉత్సాహం, సేవా సంకల్పం వ్యక్తమైంది. సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని వారు దృఢ నిశ్చయంతో ముందుకు రావాలని సంకల్పించారు.

# పేదింటి ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సహాయం అందజేసిన మాందొడ్డి హసన్..

అలంపూర్ నియోజకవర్గం మార్చి 26, ప్రజా దర్బార్: రాజోలి మండల పరిధిలోని మాన్దొడ్డి గ్రామానికి చెందిన హసన్ గురువారం పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు . మండల కేంద్రమైన రాజోలి గ్రామానికి చెందిన షేక్ గూడుసావలి రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద దినసరి కూలీ పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలు.. కొడుకు, కూతురు లతో జీవనం చేస్తున్నారు. తన కూతురుకి ప్రభుత్వ తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ వరకు చదివించారు. పై చదువులు చదివించలేని స్థితిలో లేనందున తన కూతురుకు వివాహం చేయాలని నిశ్చయించడం జరిగింది. "మై తెలంగాణ హ్యూమన్ రైట్స్ ఆఫ్ కౌన్సిల్" సంస్థ చైర్మన్ అయిన.. మాన్దొడ్డి హసన్ గారు అమ్మాయి పెళ్లికి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. గతంలో మాన్దొడ్డి హసన్ జోగులాంబ గద్వాల జిల్లాలో పలు గ్రామాలలోని పేదింటి ఆడపడుచుల వివాహాలకు సంస్థ ఆధ్వర్యంలో తనకు తోచిన ఆర్థిక సహాయం



చేసి మానవత్వం చాటుకున్నారు. అదేవిధంగా ఈ మధ్యకాలంలో రాజోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకూడా మౌలిక వసతులు నిమిత్తం పాఠశాలలో సుమారు ? :6 లక్షల రూపాయలు వెచ్చించి, మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు రాజోలి ఎం ఈ ఓ భగీరథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మాన్దొడ్డి హసన్ మాట్లాడుతూ.. మా సంస్థ ఆధ్వర్యంలో పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు నాకు తోచిన ఆర్థిక సహాయమును అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ ఎండి తాహెర్ ,గ్రామ సర్పంచ్ సుజాత బాబురావు ,మాజీ ఎంపీటీసీ మన్సూర్ ,నిర్జూర్ అగ్జర్ భాష, డాక్టర్ తిరుపతయ్య, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ వాహనాన్ని గుద్దిన ఇసుక ట్రాక్టర్ సంఘటనలో ఒకరు రిమాండ్

బషీరాబాద్ మార్చి 26 (ప్రజా దర్బార్) బషీరాబాద్ మండల పరిధిలో కోర్వి చెడ్ ఘని గ్రామం సమీపంలో తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్ పోలీస్ వాహనాన్ని గుద్దడంతో ఒకరు రిమాండ్ కు తరలించినట్లు ఎస్.ఐ వి.శ్రీశైలం తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే కోర్విచెడ్ ఘని గ్రామ సమీపంలో తెల్లవారుజామున రెండు ఇసుక ట్రాక్టర్లు కనిపించడంతో పోలీస్ వాహనంతో వెంబడించగా ట్రాక్టర్ నడిపిస్తున్న డ్రైవరు వేగంతో వెళ్తూ ఇసుక ఉన్న ట్రాలీని వెళుతూ వెళుతూ ఖాళీ చేస్తూ పొలంలోకి దూసుకుపోతూ క్రమంలో పోలీస్ వాహనానికి ఇసుక ట్రాక్టర్ తో గుద్దడంతో పోలీసు వాహనం ముందు భాగం ధ్వంసం కావడం జరిగిందని అందుకు కారణమైన వ్యక్తి మైనర్ కాకావడంతో,ట్రాలీ యజమాని సంద్యా నాయక్ తండా శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించినట్లు తెలిపారు. అదేవిధంగా మరొక్క ట్రాక్టర్ యజమాని డి.సురేష్ పై, డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ పి.శ్రీశైలం తెలిపారు.




# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేత



హస్తనాపురం మార్చి26(ప్రజాదర్బార్) శ్రీరామనవమి సందర్భంగా కర్మన్ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవములో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కి ఆలయ ఈవో లావణ్య ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం మాజీ ధర్మకర్త ఛాతిరి మధు సాగర్, వేద పండితులు చంద్ర కాంత్ శర్మ ,ముత్యాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం:జిల్లా కలెక్టర్ రాజర్షి షా...

ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి మార్చి26: రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం పై రైతు శిక్షణ, ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 21,000 విత్తన కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఒక్కో కిట్ విలువ సుమారు ?500 ఉంటుందని తెలిపారు. రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. భూమి లేని వారు తేనెటీగల పెంపకం వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నాబార్డ్, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా 35% నుండి 45% వరకు సబ్సిడీ లభిస్తుందని, ఇందుకోసం రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ లుగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఎఫ్.పి.ఓలకు అవసరమైన భూమిని కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియాను వినియోగించాలని, ఆవు పేడ, మూత్రంతో చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఎస్టీ రైతులకు ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్‌లో 7 నుండి 10 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. రైతులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 14416 కి కాల్ చేయాలని సూచించారు. పలువురు రైతులు వినాయక్ చౌక్ లోని రైతుబజార్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా, కమిటీ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ లో ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత కల్పించాలి...

## అన్నారంలో బిఆర్ఎస్ శ్రేణుల నిరసన - బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య



తుంగతుర్తి (ప్రజాదర్బార్)కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చట్ట బద్దత కల్పించాలని డిమాండ్ చేసారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో బిఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమలో పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలముందు మహిళలకు 2500. వికలాంగులకు 6000. వృద్ధులకు.4000.రైతులకు 15000వేలు. నిరుద్యోగభృతి .విద్యార్థులకు విద్యాభరోస కార్డు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి అధికారానికి వచ్చిరెండు న్నరెండ్లు అవుతున్న ఒక్కటి నెరవేర్చ లేదని అన్నారు. అధికారం లోకి రాగానే చట్ట బద్దత కల్పిస్తామని చెప్పిన మాటలు మరిచిపోయిన ప్రభుత్వానికి ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీ లో ప్రవేశ పెట్టబోయే ప్రైవేట్ మంబర్ బిల్లు కు ప్రభుత్వం మద్దతివ్వాలని అన్నారు.. ఏప్రిల్ నెలాఖరు వరకు కాల్వల్లో నీళ్ల ఇవ్వాలని నోటికాడికి వచ్చిన వరిపంట ఎండిపోకుండా రైతాంగాన్ని కాపాడాలని.రైతు భరోసా వాయిదా పద్ధతుల్లో కాకుండా ఎకరానికి ఆరువేల చొప్పున యాసంగి పంట డబ్బులను ఒకేసారి ఇవ్వాలని అన్నారు.యాసంగి పంటకు ఇవ్వాల్సిన నీరు ఇవ్వకుండా కొత్తలప్పుడు వాయిదాల ప్రాకారమివ్వ దమంటే ఈ పేరుతో వచ్చే వానకాలం భరోసా ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం ఎత్తుగడ చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు దొంగరి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కు చాల శ్రీనివాస్ రెడ్డి నాయకులు, మట్టిపెల్లి వెంకట్. మన్నూరు పోతరాజు, ఇసాకర్, సతీష్,బెదద రాములు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, సైదులు సరిత, బింగివెంకన్న మహేష్, తదితరులు పాల్గొన్నారు

## పెద్ద శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్..



పెద్ద శంకరంపేట్ , మార్చ్ 25 (ప్రజా దర్బార్)పెద్ద శంకరంపేట్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమగ్ర వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన వైద్య సేవల నిర్వహణను పరిశీలించి ప్రజలకు అందుతున్న చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.. శిబిరంలో గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, ఆప్తమాలజిస్ట్ సేవలు అందిస్తూ మహిళలు చిన్నపిల్లలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.. ఆశా వర్కర్ల ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వైద్యుల వద్దకు తీసుకురావాలని సూచించారు.. పోషకాహారం లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి ఆరోగ్యక పరిస్థితిని పెరుగు పరచాలని పేర్కొన్నారు ..క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి అవసరమైన రోగులను ఉన్నత వైద్య సేవల కోసం ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు..పెద్ద శంకరంపేట పీహెచ్సీని ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవతో సిఎస్సి గా అప్గ్రేడ్ చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని దీనికి తెలంగాణ వైద్య పరిషత్ సహకరిస్తుందని తెలిపారు .. సర్పంచ్ జంగం రేణుక, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నవ్య, డాక్టర్ షర్ఫుద్దీన్, హెచ్ఈఓ యాదయ్య, సూపర్వైజర్ రమణంబాయి, హెల్త్ అసిస్టెంట్ సాయిలు, డాక్టర్లు సునీల్, కవిత, వసంత ఇతర స్పెషలిస్టు వైద్యులు పాల్గొన్నారు.

## కాళాపూర్‌లో భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన

పరిగి,మార్చి26(ప్రజాదర్బార్)వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళాపూర్, రాపోల్ గ్రామాల్లో ప్రతిపాదిత భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు, గ్రామస్తులు నేడు ఆందోళన చేపట్టారు. అభివృద్ధి పేరుతో 1200 ఎకరాల పంట భూములను స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య మాట్లాడుతూ, కాళాపూర్ గ్రామంలో పేద రైతులకు జీవనాధారమైన పంట భూములను ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో బలవంతంగా తీసుకోవడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఈ భూములు కోల్పోతే రైతు కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయని, జీవనోపాధి కోల్పోతారాని అన్నారు,సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ నిర్వహించకుండా భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం చట్ట విరుద్ధమని అన్నారు. అలాగే, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా నోటిఫికేషన్ జారీ చేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు.తక్షణమే భూసేకరణను నిలిపి వేయాలని అన్నారు ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కులు కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో వెంకటయ్య,హబీబ్ సిపిఎం నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణానికి ఆహ్వానం



మరిపెడ ప్రజా దర్బార్ మార్చి 26:-శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి స్వామి దేవస్థానంలో నేడు నిర్వహించే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని మున్సిపల్ చైర్పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, తహశీల్దార్ కృష్ణవేణి, సీఐ రాజ్ కుమార్ గౌడ్, ఎస్ఐ వీరభద్రరావులను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గురువారం వారు మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ చైర్ పర్సన్, తహశీల్దార్, సీఐ, ఎస్ఐలను కలిశారు. అనంతరం రాములోరి కళ్యాణ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉల్లి శ్రీనివాసరావు, రాంబాబు, బోడ రుప్లా, బూరుగు దిలీప్, వెంపటి కృష్ణమూర్తి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, మార్చి 26,(ప్రజాదర్బార్) :మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొం టున్న ఆస్తి సంబంధిత సమస్యలను గురు వారం తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమా వేశాల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్ రెడ్డి ప్రస్తావించారు. నియోజకవర్గం పరిధిలో సుమారు 384 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 76 కాలనీలను “వక్ఫ్ బోర్డు ఆస్తులు”గా ప్రకటించి, 2024 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖ వారు 22-ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన విషయాన్ని ఎమ్మెల్యే, సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నిర్ణయం కారణంగా సుమారు 18,000 ఇళ్ల యజమా నులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రాపర్టీ టాక్స్ (పీటీఐ) నెంబర్లు కలిగిన ఇళ్ల యజమానులు బ్యాంకు లోన్లు పొందడం, మార్టిగేజ్ చేయ డం, ఇల్లు అమ్మడం, లేదా అదనపు అంత స్తులు నిర్మించడం వంటి అవసరాలకు పెద్ద ఎత్తున అవరోధాలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యకు పరిష్కారం లేకపోవడంతో, ప్రజలు కోర్టులను ఆశ్రయిం చాల్సి వస్తోందన్నారు. కోర్టు ద్వారా అనుమ తులు పొందేందుకు భారీగా ఖర్చులు (సుమారు లక్ష రూపాయల వరకు) చేయాల్సి వస్తోందని ఎమ్మెల్యే, ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వుల ఆధారంగా మాత్రమే రిజిస్ట్రే షన్లు జరుగుతున్న పరిస్థితిని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో, సంబంధిత భూములు నిజంగా వక్ఫ్ బోర్డు ఆస్తులేనా..? కాదా..? అన్న విషయాన్ని ప్రభుత్వం తక్షణం స్పష్టతతో తేల్చాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆస్తి లావాదేవీలు (ట్రాన్సాక్షన్స్) సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, సభాపతి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే వినతిపై సంబంధిత మంత్రి స్పందించి, ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు.

# ధర్మ బిక్షం ఆశయాలు యువతకు మార్గదర్శకం

మర్రిగూడ, మార్చి 26 ప్రజాదర్బార్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మ బిక్షం 15వ వర్ధంతి సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ మాట్లాడుతూ ధర్మ బిక్షం నైజాం ప్రభుత్వాన్ని గద్దె దించడంలో కీలక పాత్ర పోషించిన మహానేత అని కొనియాడారు. విద్యార్థి దశలోనే సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి, పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. పేద ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని, వారికి అండగా నిలిచిన ధర్మ బిక్షం ప్రజల పెన్నిధిగా నిలిచారని పేర్కొన్నారు. శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన సమయంలో ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. దేశవ్యాప్తంగా గీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని బలోపేతం చేసి, కార్మికుల సంక్షేమానికి కృషి చేశారని గుర్తుచేశారు. ధర్మ బిక్షం ఆశయాలు, ఆయన చూపిన మార్గం యువతకు ఆదర్శంగా నిలుస్తాయని, ఆయన బాటలోనే నడవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆయన ప్రభావంతో వేలాది మంది విద్యార్థులు, యువకులు కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్, సిపిఐ మండల నాయకులు అయితగోని వెంకటయ్య, వేముల సత్తయ్య, కర్నాటి అంజయ్య, ఎరుకల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఆహ్వానం,



ప్రజాదర్బార్, కుత్బుల్లాపూర్, మార్చి,26, శ్రీ రామ పర్వదినం పురస్కరించుకొని గాజుల రామారం డివిజన్ పరిది, ఉమాదేవినగర్ లోని శ్రీ శివకేశవ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో నేడు  జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలకు హాజరు కావాలని గురువారం జగద్గిరిగుట్ట డివిజన్,మగ్దూమ్ నగర్ ప్రాంతంలోని కార్పొరేటర్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ తో పాటు,ఆయన సోదరుడు బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్ కు పలు ప్రాంతాల ఆలయాల నిర్వాహకుల తోపాటు ఉమాదేవినగర్ సంక్షేమ సంఘం,ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికల ను అందజేశారు. కలిసిన వారిలో కమిటీ సభ్యులు పేరవొయిన సమ్మయ్య యాదవ్,పొడిచేటి రాములు గౌడ్,ఏ. శంకర్,మోక్ల శంకర్,ఆత్మకూరు సంతోష్ గుప్తా,పొడిచేటి మహేష్ గౌడ్, నాయకులు పోలేపల్లి శేషారెడ్డి,రాయి విగ్నేష్ ఆర్. నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి:జిల్లా కలెక్టర్ రాజర్షి షా...

ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి మార్చి26: ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరగనున్న పదవతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టాస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుండి 27 వరకు పదవ తరగతి, ఏప్రిల్ 28 నుండి మే 5 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, పరీక్షా సమయాలు ఉదయం 9:00 నుండి 12:00 వరకు, మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు ఉంటాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 4 పదవతరగతి, 3 ఇంటర్మీడియట్‌కు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీటీవీ కెమెరాల నిఘా ఉండాలని, తాగునీరు, వెలుతురు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా పత్రాల రవాణా, భద్రత కోసం పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని, విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 7 గంటల నుండే ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. అదే విధంగా మార్చి 29 ఆదివారం రోజు జరగనున్న 'ఉల్లాస్' అక్షరాస్యత పరీక్షపై కలెక్టర్ సమీక్షిస్తూ,. జిల్లాలో సుమారు 20,000 మంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభ్యాసకులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని, వారందరూ ఉత్తీర్ణులయ్యేలా చూడాలని లెర్నింగ్ సెంటర్ల నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. వారందరికీ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునేలా చూడాలని, బేస్‌లైన్ టెస్టులకు హాజరుకాని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్లు అశోక్, సుజాత్ ఖాన్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు శైలజా, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఆడే గజేందర్ ని కలిసిన పార్టీ ప్రధాన కార్యదర్శి ఏనుగు లక్ష్మారెడ్డి..

నేరడిగొండ, ప్రజాదర్బార్ మార్చి26: నేరడిగొండ మండలంలోని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే  గజేందర్ ను నూతనంగా నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు లక్ష్మారెడ్డిని నియమించినందుకు గురువారం ఆడే గజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సన్మానించారు. నేరడిగొండ లోని ఆడ గజేంద్ర క్యాంపు కార్యాలయంలో సత్కారం చేశారు. ఈ సందర్భంగా తనపై ఉంచిన నమ్మకాన్ని తూచా తప్పకుండా పాటిస్తానని  ఏనుగు లక్ష్మారెడ్డి అన్నారు. అనంతరం బోత్ నియోజకవర్గం ఇంచార్జ ఆడే. గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, అందులో భాగంగానే ఏనుగు లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ పార్టీ గుర్తించి,అదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందనీ అన్నారు. ఆయన వెంట నాయకులు , కార్యకర్తలు పాల్గొనారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి,

ప్రజాదర్బార్, కుత్బుల్లాపూర్, మార్చి,26, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. దూలపల్లి వాసులు మేఘన డప్పు రూ .30,000/– జీడిమెట్ల వాసులు వీరమళ్ళ శ్రీ రాములు రూ. 60,000/– కుత్బుల్లాపూర్ వాసులు సావిత్రి మానెనూర్ రూ. 41,000/– బహదూర్ పల్లి వాసులు ఆర్. సతీష్ రూ. 55,000/– దూలపల్లి వాసులు తుడుము రాజ్ కుమార్ రూ.17,500/– ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో కొట్టాలలో అభివృద్ధి జోరు

## 29 ఎల్ఈడి బల్బుల పంపిణీతో కొట్టాల గ్రామానికి కొత్త వెలుగు





మర్రిగూడ, మార్చి 26 -- ప్రజాదర్బార్మండలంలోని కొట్టాల గ్రామపంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఒక ముఖ్యమైన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామానికి 29 ఎల్ఈడి బల్బులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రామంలో వెలుగులు నింపే దిశగా ఒక మంచి ముందడుగుగా నిలిచింది.( గ్రామ సర్పంచ్ లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ డైరెక్టర్ గంట మల్లేష్, మాజీ సర్పంచ్ గంట కవిత యాదయ్య, మాజీ సర్పంచ్ నేర్లకంటి యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని వివిధ వార్డులకు చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. 1వ వార్డ్ సభ్యుడు గంట అంజయ్య, 2వ వార్డ్ సభ్యుడు గంట సంతోష్ ప్రవీణ్, మాజీ వార్డ్ సభ్యుడు గంట శ్రీనివాస్, కొలుగూరి విష్ణు, గంట ముత్యాలు, గంట యాదయ్య, గంట వెంకటయ్య, కక్కునూరి శ్రావణ్, కల్లెట్ల సాయికిరణ్, ఉబ్బు బుచ్చయ్య, గంట రవి, గంట పెద్ద మల్లయ్య, కక్కునూరు వెంకటయ్య, గంట దండయ్య, గంట పద్మ, గంట భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అశోక్ కుమార్.



భూపాలపల్లి ప్రజాదర్బార్ ప్రతినిధి మార్చి26.జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరంగా, పారదర్శకంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం భూపాలపల్లిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ (లక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, పెట్రోల్ మరియు డీజిల్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, అమ్మకాల విధానం, భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, వినియోగదారులకు సమయానికి సరఫరా అందేలా అధికారులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలు సామాజిక మాధ్యమంలో ప్రచారం అవుతున్న వదంతులను నమ్మవద్దని, అవసరానికి అనుగుణంగా మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎలాంటి కొరత లేకుండా సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఆయిల్ కంపెనీలు ఇండెంట్ల ఆధారంగా నిరంతర సరఫరా కొనసాగిస్తున్నాయని వెల్లడించారు. వదంతుల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా నిల్వలు చేయడం లేదా అక్రమంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపడితే, వారిపై చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కోసం కలెక్టర్ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. ఈ కమిటీ ద్వారా నిత్యావసర సరఫరాలపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ యజమానులు ధరల బోర్డులు, నిల్వ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని, వినియోగదారులతో వినయంగా ప్రవర్తించాలని ఆదేశించారు. ఆయిల్ కంపెనీల గైడ్‌లైన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ, తగినంత స్టాక్ నిల్వ ఉంచి, సమయానికి ఇండెంట్లు పెట్టాలని సూచించారు. ఈ తనిఖీలో పౌర సరఫరాల అధికారి శరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొంది మురళి

అశ్వారావుపేట మార్చి 26 ప్రజాదర్బార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గం పరిధిలోని దమ్మపేట మండలంలో కోర్టు ఆవరణలో జరిగిన బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు ఆసక్తికరంగా సాగిన తరుణంలో సీనియర్ న్యాయవాది గొంది మురళి మోహన్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా, 12 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు ఓట్లు లెక్కింపు చేయగా 8 ఓట్లు గొంది మురళి మోహన్ కు రావడంతో గొంది మురళి స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా సాగి, సభ్యుల విశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఫలితాలు వచ్చాయి అని వారు తెలిపారు. దమ్మపేట బార్ అసోసియేషన్ 2025 సంవత్సరంలో ఏర్పడినప్పుడు మొదటిసారి సభ్యులందరూ కలిసి ఏకగ్రీవ ఎన్నిక ద్వారా కమిటీని ఏర్పాటు చేసుకోగా ఈసారి మాత్రం ఎన్నిక రూపంలోనే ఏర్పాటు చేసుకోవడం కొంచెం ఆలోచించదగ్గ విషయం. గొంది మురళి గత 20 సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తూ మంచి అనుభవం సంపాదించారు. గతంలో సత్తుపల్లి కోర్టులో వివిధ పదవులు అనుభవించిన ఆయన దమ్మపేట బార్ అసోసియేషన్‌లో అడహక్ కమిటీ లో ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2025లో జరిగిన ఏకగ్రీవ ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఆ అని బార్ అసోసియేషన్ సమస్యలపై పోరాడుతానని సభ్యులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తాను అని ఎన్నికలు ఈరోజు వరకేనని మరుసటి నుంచి మేము అందరం సొంత అన్నదమ్ముల వల్లే కలిసిమెలిసి ఉంటాము అని ఆ విధంగా ముందుకు సాగుతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు గొంది మురళిని అభినందిస్తూ, ఆయన నాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంక్షేమం, కోర్టు వ్యవస్థ అభివృద్ధి, సేవల మెరుగుదలకు ఆయన కృషి చేస్తారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లో శ్రీరామనవమి వేడుకలు -



నాచారం, మార్చి 26(ప్రజాదర్బార్ ) నాచారం లోని దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ నవనీత రావు, డైరెక్టర్ నవీన్ కుమార్ లు హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు రాముడు, లక్ష్మణుడు, సీత వేశాధారణలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నవనీత రావు మాట్లాడుతూ.. రామాయణం భారతదేశ ఇతిహాసా లలో గొప్పది అని తెలిపారు. కుటుంబ విలువలు, సత్యం, ధర్మం వంటి గొప్ప విలువలు ప్రపంచానికి చాటిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కోర్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించినఉపాధ్యాయురాలు...

వెల్దుర్తి, మార్చి 26: ( ప్రజా దర్బార్) పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేకం గురించి పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు ఇ.రేణుకా దేవి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మాదక ద్రవ్యాల (ఐతీబస్త్రం) వినియోగాన్ని అరికట్టడం, వాటి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, మరియు సమాజాన్ని రక్షించడం. ఇది వ్యక్తిగతంగా, కుటుంబంగా, సమాజంగా తీసుకోవాల్సిన బాధ్యతల గురించి తెలియజేశారు. డ్రగ్స్ అనేవి మన శరీరం, మెదడు మీద ప్రభావం చూపే పదార్థాలు. కొన్ని వైద్య ప్రయోజనాల కోసం వాడతారు కానీ దుర్వినియోగం చేస్తే ప్రమాదకరం అని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ,మెదడు పనితీరు తగ్గుతుంది, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, డిప్రెషన్, ఆందోళనగుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయని తెలియజేశారు. కావున విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. మాదకద్రవ్యాల వ్యతిరేకం పై విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు జయసుధ, శైలజ, నవనీత, సునీత,అర్చన,రాధిక ప్రియదర్శిని,ప్రశాంతి దేవి మరియు ఇతర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నాయకుడు మాజీ సర్పంచి విజయ్ పాల్ రెడ్డి మాతృమూర్తి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మంత్రి కొండ సురేఖ



శాయంపేట ప్రజాదర్బార్ మార్చి 26: తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ గురువారం హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం శాయంపేటలో పర్యటించారు. తనకు ఆత్మీయులు శాయంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అడ్వకేట్ గట్ల విజయపాల్ రెడ్డి, గట్ల మహిపాల్ రెడ్డి, గట్ల జైపాల్ రెడ్డి వారి తల్లి గట్ల అహల్యమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఆమె అంతిమయాత్రలో కూడా పాల్గొన్నారు. అహల్యమ్మ మరణం వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్న మంత్రి, భగవంతుడు వారికి మనోధైర్యం, ఆత్మస్థైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. అనంతరం తనను కలిసిన ముఖ్య నాయకులతోమాట్లాడుతూ శాయంపేట నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు స్థానిక నాయకులు అందరూ తనను గుర్తించి, రాజకీయ ప్రయాణంలో తోడుగా నిలిచిన వారేనని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.వారిసహకారంతోనేతానుఈస్థాయికి చేరుకున్నాననితెలిపారు. నియోజకవర్గం పేరు మారినప్పటికీ శాయంపేటను ఎప్పటికీ మర్చిపోమని, గీసుకొండ తర్వాత శాయంపేట మండలం తమకు ఎంతో ముఖ్యమని అన్నారు. తమ పదవీకాలంలో శాయంపేటలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, అప్పట్లోనే కోట్ల విలువైన భూమిని గ్రామానికి కేటాయించామని చెప్పారు. అభివృద్ధి విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదని, సర్పంచులు, ఎంపీటీసీలు కూడా పోటీగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. ప్రస్తుతం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతోందని మంత్రి తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనలో శాయంపేట పేరును తిరిగి చేర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని, ఇందుకు సంబంధించిన నిబంధనలను పాటిస్తూ ప్రయత్నాలు కొనసాగిస్తామని చెప్పారు.సీట్ల సంఖ్య పెరిగితే శాయంపేట పేరుకు అవకాశం ఉండొచ్చని, పార్టీ నిర్ణయాల మేరకు పారదర్శకంగా ముందుకు వెళ్తామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు

## వార్డు సభ్యుల శిక్షణ ముగింపు -- ఘనంగా సర్టిఫికెట్ల పంపిణీ



సిర్పూర్ (యు), ప్రజాదర్బార్ మార్చి 26: మండలంలోని వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్లను ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమర్ డి ఎల్ పి ఓ.. ఎం పి ఓ ప్రమోద్ తో పాటు అన్ని టిఓటి లు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా గ్రామస్థాయి పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సభ్యులకు అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం సజావుగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను, శిక్షకులను అభినందించారు.

# --శుభకార్యాల్లో కొబ్బరికాయ ఎందుకు కొడతారు..?-వెనుక రహస్యం ఏమిటి..?

కొందుర్గు మార్చి 26(ప్రజాదర్బార్):-సనాతన ధర్మంలో కొబ్బరికాయను పండగలు, శుభకార్యాలకు ముందు కొట్టడం వెనుక లోతైన ఆధ్యాత్మిక భావం ఉంది. ఈ ఆచారం ప్రాచీన కాలం నుంచి కొనసాగుతోంది. ఏదైనా పూజ, హోమం లేదా శుభకార్యం ప్రారంభించే ముందు కొబ్బరికాయను సమర్పించడం "కొబ్బరి యజ్ఞం"గా భావిస్తారు. దీనికి ఉన్న ప్రధాన కారణాలు ఇలా ఉన్నాయి. సనాతన విశ్వాసాల ప్రకారం, జగత్తు రక్షకుడైన విష్ణుమూర్తి భూమిపై అవతరించినప్పుడు, ఆయనతో పాటు లక్ష్మీదేవి, ఒక కొబ్బరి చెట్టు, కామధేనువును తీసుకువచ్చినట్లు చెబుతారు. అందుకే కొబ్బరికాయను "శ్రీఫలం"గా పిలుస్తారు. ఇది శుభానికి, సంపదకు సూచికగా భావించబడుతుంది. కొబ్బరి చెట్టును కల్పవృక్షంతో సమానంగా పరిగణిస్తారు. అనేక విశ్వాసాల ప్రకారం, బ్రహ్మ, విష్ణువు, శివుడు ఈ చెట్టులో ప్రతీకాత్మకంగా కొలువై ఉన్నారని భావిస్తారు. అందుకే పూజలో కలశంపై కొబ్బరికాయను ఉంచడం ఆచారంగా ఉంది. ఇంద్రుడు కూడా.. మరో నమ్మకం ప్రకారం, ఒకప్పుడు విశ్వామిత్రుడు కోపంతో ఇంద్రుడును ఎదిరించి కొత్త స్వర్గాన్ని సృష్టించాలని తపనపడ్డారని చెబుతారు. ఆ ప్రయత్నంలో కొబ్బరికాయను ప్రత్యేకంగా ఉపయోగించినట్లు కథలు చెబుతాయి. కొబ్బరికాయను కొట్టడమంటే.. కొబ్బరికాయను దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైనదిగా కూడా భావిస్తారు. దానికి ఉన్న మూడు "కన్నులు" శివుడి మూడు నేత్రాలను సూచిస్తాయని చెబుతారు. కొబ్బరికాయ సంవత్సరం పొడవునా లభించే ఫలం కావడం వల్ల అది సమర్పణకు అనుకూలంగా పరిగణించబడుతుంది. పూజ సమయంలో కొబ్బరికాయను కొట్టడం అంటే మన అహంకారాన్ని, స్వార్థాన్ని వదిలిపెట్టి దైవానికి పూర్తిగా శరణాగతి చేయడాన్ని సూచిస్తుంది. మొత్తంగా, కొబ్బరికాయ కొట్టడం అనేది అహంకారాన్ని త్యజించడం, దైవానికి సంపూర్ణంగా సమర్పించుకోవడం, శుభం, శాంతి, శ్రేయస్సును కోరుకునే సంకేతంగా భావించబడుతుంది. జంతుబలికి బదులుగా.. అలాగే కొబ్బరికాయను మానవ శరీరానికి ప్రతీకగా కూడా భావిస్తారు. దాని గట్టి చిప్పను పుర్రెగా, లోపలి గుజ్జును మానవ మాంసంగా, నీటిని రక్తంగా పోలుస్తారు. పూర్వకాలంలో యజ్ఞాల సమయంలో జీవబలి ఆచారం ఉండేదని, కాలక్రమేణా దానికి బదులుగా కొబ్బరికాయను సమర్పించడం ప్రారంభించారని



చెబుతారు. ఇది హింసారహిత మార్గంలో దైవానికి అర్పణ చేయడాన్ని సూచిస్తుంది. ఈ వార్తలోని సమాచారం మత విశ్వాసాలపై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు అందించడం జరిగింది.

## రాంపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభోత్సవం

కొండపాక (ప్రజాదర్బార్) మార్చ్ 26:సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో "సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా రాంపల్లి గ్రామంలో సర్పంచ్ బొమ్మ మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సిద్దిపేట అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను ప్రారంభించారు. సీసీ కెమెరాలు గ్రామ భద్రతను, పెంచడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమానికి సహకరించిన సర్పంచ్ మల్లయ్యను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు గ్రామ పోలీసు అధికారి సీసీటీవీ కోఆర్డినేట్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బొమ్మ మల్లయ్య , ఉప మాధవి, గ్రామ సెక్రటరీ అనిల్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పోలీసు సిబ్బంది మరియు గ్రామ ప్రజలు, మరియు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి.. మాజీ టి పి సి సి జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత..

ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి మార్చి26: భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పై తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమే ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఇప్ప సారా ఉత్పత్తి గురించి మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు ప్రస్తావనలో వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ వ్యాఖ్యల సమయంలో అక్కడే ఉన్న ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు నవ్వుతూ స్పందించడం మరింత బాధాకరమని అన్నారు.దేశానికి ఎన్నో సేవలు చేసిన ఇందిరా గాంధీ గొప్పతనం బీజేపీ నాయకులకు అర్థం కావడం లేదని సుజాత విమర్శించారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదలకు గృహాల నిర్మాణం, గిరిజనులకు భూముల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, దేశ సమగ్రత కోసం చివరి వరకు పోరాడి ప్రాణత్యాగం చేసిన మహానేతగా ఆమెను గుర్తుచేశారు. చేస్తున్నా'ం'ని, వారు కేవలం అదాని అంబానీ లాంటి పెద్ద పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలకే పని చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల, పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు గర్వంగా ఇందిరా గాంధీ పేరును పెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ పై చేసిన వ్యాఖ్యలకు బాధ్యులైన బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో పాటు, వాటిని ఖండించకుండా వెకిలి నవ్వులు నవ్విన ఉమ్మడి ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

# భగత్ సింగ్ నగర్ కాలనీని ప్రభుత్వమే సర్వే చేసి స్థలాన్ని పంచండి

# - పేద ప్రజలకు 60 గజాలు చొప్పున పంచాలి

## సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




మేడిపల్లి,మార్చి26(ప్రజా దర్బార్) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ మేడిపల్లి పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీని ప్రభుత్వమే సర్వే చేసి పేదలకు 60 గజాల చొప్పున పంచాలని సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి ఎమ్మార్వో కృష్ణ చైతన్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ హాజరై ఎమ్మార్వోకు పేదల స్థితిగతులపై గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ మేడకపల్లిలోని సర్వే.నెం48 భగత్ సింగ్ నగర్ కాలనీలో కొంత మంది వ్యక్తులు ప్రైవేట్ సర్వేయర్ ను తీసుకువచ్చి వాళ్లంతాలా వాళ్ళు గా ప్రభుత్వ భూమి కొల్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని దీనివలన కొంతమంది పట్టాలు రాని వారికి ఇబ్బందికరంగా మారుతుందని,రాజకీయంగా కొంత మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. కోర్టు పేరు,సర్వేయర్ పేరుతో ఒకరి నుండి మూడు వేల రూపాయలు వసూళ్లకు పాల్పడడానికి పూనుకున్నారని ఇదంత దోపిడికి పాల్పడడమేనని అన్నారు. జీవో నెంబర్ 58 ప్రకారం ఒక వ్యక్తికి 80 గజాల కంటే మించి పట్టా ఉండకూడదు,కానీ గతంలో జారీ చేసిన పట్టాలు ఒకరికి 120 గజాలు కొంతమందికి 118,116 ఇలా పట్టాలు వచ్చాయని వాటన్నింటిని పరిశీలించి పేదలకు సమానంగా70 గజాల చొప్పున పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు వి.పి బాలరాజ్,మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్.మాధవి,జి.నాగరాజు,కే.ప్రమీల,కే.మహాలక్ష్మి, భూతం ఐలయ్య, బాపురాజు,రామతార,నర్సమ్మ, ఆండాలు,ఇస్తారి,సరిత తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రం నుండి గ్రామాలకు వెళ్లే దారిలో అగాధాల్లాంటి గుంతలు

## రోడ్డును పట్టించుకోని పాలకులు ప్రమాదాలకు నిలయం

## వడ్ల లోడు ట్రాక్టర్లు పల్టీ కొట్టే ప్రమాదం ప్రాణభయంతో రైతుల ప్రయాణం



మాడుగులపల్లి, (ప్రజాదర్బార్)మార్చి26:- మాడుగులపల్లి మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం మృత్యుపాశంలా మారింది మండల కేంద్రం నుండి చెరువుపల్లి, దాచారం, నారాయణపురం, కన్నెకల్లు వంటి గ్రామాలకు వెళ్లే దారిలో సుమారు 200 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమై అడుగడుగునా లోతైన గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.ప్రాణసంకటంగా మారిన వడ్ల రవాణాప్రస్తుతం వడ్ల కొనుగోళ్ల సీజన్ కావడంతో, రైతులు తమ పంటను ట్రాక్టర్లలో లోడు చేసుకుని గ్రామాలనుండి మండల కేంద్రానికి వస్తున్నారు. అయితే, ఈ 200 మీటర్ల అధ్వానపు రోడ్డుపై లోడుతో ఉన్న ట్రాక్టర్లు వెళ్లడం ప్రాణసంకటంగా మారింది గుంతలు ఎంత లోతుగా ఉన్నాయంటే ఏ క్షణంలో ట్రాక్టర్ పల్టీ కొడుతుందో తెలియడం లేదు. ఎంతో కష్టపడి పండించిన పంట రోడ్డుపాలవుతుందేమోనని భయంగా ఉంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులుమండల కేంద్రం నుంచి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ కీలక రహదారిని కనీసం పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే దారిలో తిరుగుతున్నా, కనీసం గుంతలు పూడ్చే నాథుడే కరువయ్యారని మండిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ఈ గుంతలు కనిపించక పడిపోయి తీవ్ర గాయాలపాలవుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి యుద్ధ ప్రాతిపదికన ఈ 200 మీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వడ్ల సీజన్ పూర్తయ్యేలోపు శాశ్వత పరిష్కారం చూపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# నేరేడుచర్ల పి హెచ్ సి లో ప్రభుత్వం బాలిక సంరక్షణ కేంద్రం కి నవజాతి శిశువును దత్తత

ప్రజా దర్బార్ .నేరేడుచర్ల సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవం అయిన ఇరుగు మనిత భర్త నాగరాజు గ్రామం. పాలకవీడు (4) వ ఆడ బిడ్డకు జన్మను ఇచ్చింది ( గతం లో మూడు ప్రసవాలు ఆడ బిడ్డలే) వీరు రోజువారి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారూ వారి ఆర్థిక స్థితి సరిగా లేని కారణంగా 4వ బిడ్డను సాకటం కష్టం అని భావించి ఇష్టపూర్వకంగా ఎవరి ఒత్తిడి లేకుండా వారికి పుట్టిన నవజాత శిశువును ప్రభుత్వ వారికి బాలిక సంరక్షణ కొరకు దత్తత ఇవ్వడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డా. వెంకట రమణ , ఉప జిల్లా వైద్యాధికారి డా. చంద్ర శేఖర్ , ప్రోగ్రాం అధికారి డా. నజియా జిల్లా వైద్య అధికారి మరియు నేరెడుచర్ల డా.పున్న నాగిని ఆద్వర్యం లో ఆడపిల్లను వారి తల్లి, తండ్రి స్వచ్ఛందం గా మహిళా శిశు సంక్షేమ శాఖ వారికి అందచేశారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా వెంకట రమణ ఉప జిల్లా వైద్య అధికారి డా. చంద్ర శేఖర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నజియా మున్సిపల్ చైర్మన్ కొనతం వెంకట రెడ్డి ఎస్సై రవీందర్ నాయక్ , కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, నర్సింగ్ ఆఫీసర్ స్వాతి, విజయసుశీల, స్వాతి ఆశా అంగన్వాడీ కార్యకర్తలు మరియు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి ప్రొటెక్షన్ ఆఫీసర్ షేక్ నాగులు మీరా, సూపర్ వైజర్ రేవతి. తదితరులు పాల్గొన్నారు

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో వరద నిర్వహణపై అవగాహన సదస్సు..



ప్రజాదర్బార్, కరీంనగర్ :అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, ఎన్సీసీ 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత ఇతర ఎన్సీసీ అధికారులతో కలిసి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో యువ ఆపదమిత్ర పథకం భాగంగా నిర్వహించిన వరద నిర్వహణ అవగాహన సదస్సులో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని, దీనికి సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదని పేర్కొన్నారు. ఎన్సీసీ కేడెట్లకు ఈ అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు సమాజానికి సేవ చేయగల సత్తా పెంపొందుతుందని తెలిపారు. లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత మాట్లాడుతూ విద్యార్థుల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంపొందించడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి, వాటిని సమయానికి అమలు చేయడం అవసరమని అన్నారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులలో బాధ్యతా భావం మరియు సేవాస్ఫూర్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. యువ ఆపదమిత్ర పథకం ద్వారా కేడెట్లకు వివిధ విపత్తులపై విస్తృత అవగాహన కల్పించబడుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాము నేర్చుకున్న విషయాలను ఇతరులకు కూడా తెలియజేసి సమాజంలో చైతన్యం తీసుకురావాలని కోరారు. విపత్తుల నిర్వహణ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అందులోని మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేస్తే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా, వాటిని నివారించగలమని వివరించారు. ఈ శిబిరంలో భాగంగా లోయర్ మనేర్ డ్యామ్ వద్ద వరద పరిస్థితుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ప్రాయోగిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ రెస్క్యూ టెక్నిక్స్ మరియు పడవల నిర్వహణ పై జిల్లా అగ్నిమాపక అధికారి ఎం. శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ కరీంనగర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్,సిరిసిల్ల మార్గదర్శకత్వంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ వి. కృష్ణ, ఎన్సీసీ అధికారులు కేడెట్లు పాల్గొన్నారు.



# విలువలతో కూడిన విద్య అవసరం: ఎంఈఓ పురం దాస్







చేవెళ్ల, మార్చి 26(ప్రజాదర్బార్ ): విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని చేవెళ్ల మండల విద్యాధికారి ఎల్. పురం దాస్ పేర్కొన్నారు. మండలంలోని పల్లవి కిడ్స్ స్కూల్ ఆవరణంలో బుధవారం రాత్రి నిర్వహించిన 'వాసుదేవ కుటుంబకం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాలలు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన అన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పాఠ్యపుస్తకాలతో పాటు క్రీడలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానంపై కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకంచేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 'వాసుదేవ కుటుంబకం' వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనందంతో పాటు మంచి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రకృతితో అనుసంధానం ద్వారా పిల్లల్లో మంచి ఆలోచనలు పెరుగుతాయని పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బరీరా ఖాతూన్, కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్ క్రాంతి కుమార్, నవాజ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శేఖర్, ఆంజనేయులు, మాణిక్యం, గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కూరగాయ రైతులకు కిసాన్ ఐడీ కార్డులుప్రత్యేక ప్రోత్సాహం

## సేంద్రియ పద్ధతులపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యం

## డైరెక్టర్ యాస్మిన్ భాష

బుద్వేల్,మార్చి 26(ప్రజాదర్బార్)రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు కిసాన్ ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష తెలిపారు. ఈ కార్డుల ద్వారా రైతులకు రుణాలు, ప్రత్యేక మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూరగాయల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.215 కోట్ల బడ్జెట్ కేటాయించిందని, ప్రతి సంవత్సరం 50 వేల ఎకరాల్లో విస్తీర్ణం పెంచే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్కేవీవై, ఎంఐడిహెచ్ పథకాల కింద 50 శాతం సబ్సిడీతో పందిర్లు,పరికరాలు అందిస్తున్నామని, మినీ ట్రాక్టర్లు సహా 17 రకాల యంత్రాలకు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.రైతులు నాణ్యమైన నర్సరీల నుంచి నారు తీసుకోవాలని,నిబంధనలు ఉల్లంఘించే నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మల్టీ లేయర్ ఫార్మింగ్,పంట మార్పిడి,సేంద్రియ పద్ధతులపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యమని సూచించారు.కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ వంటి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైస్ చాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి మాట్లాడుతూ..స్థానిక వనరులతో సేంద్రియ ఎరువులు తయారు చేసి వినియోగిస్తే ఖర్చులు తగ్గుతాయని,మార్కెట్‌కు అనుగుణంగా పంటలు సాగు చేస్తే కూరగాయల్లో మంచి లాభాలు సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు,శాస్త్రవేత్తలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేత

చింతలపాలెం ప్రజాదర్బార్‌సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో సూరయ్య, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోర్తాల సీతారెడ్డి, కొత్తగూడెం గ్రామ సర్పంచ్ మాలవత్ శారద సామ్యు, ఎర్రగుంట తండా మాజీ సర్పంచ్ బుజ్జి హుస్సేన్, చింతలపాలెం గ్రామ శాఖ దొండపాటి వెంకటరెడ్డి, సిపిఐ మండల నాయకులు చిత్తలూరీ వీరబాబు, , కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అతివేగంగా వాహనాలు నడపవద్దు... ఎస్సై రవీంద్ర నాయక్

ప్రజా దర్బార్ నేరేడుచర్ల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డ్రైవర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా వెళ్ళాలి, అతి వేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు.

# హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రమూర్తి శోభాయాత్ర నీ విజయవంతం చేద్దాం

రంగారెడ్డి 26 మార్చి (ప్రజాదర్బార్):- శుక్రవారం నాడు షాద్ నగర్ పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మానికి ప్రతీక అయిన మన శ్రీరామ చంద్రమూర్తి శోభాయాత్రని ప్రతి ఒక్క హిందూ యువకుడు తన బాధ్యతగా శోభాయాత్ర లో పాల్గొనాలి. హిందువుల ఐక్యత, ధర్మ పరిరక్షణే ధ్యేయంగా హిందువులందరినీ ఏకతాటిపై కి తీసుకువచ్చే కార్యక్రమం కాబట్టి కులాలు, రాజకీయ పార్టీలకు అతీతం గా ప్రతి హిందువు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, ప్రతి హిందు బంధువుని పేరు పేరు న ఆహ్వానిస్తున్నాము. ఈ కార్యక్రమంలో చెట్ల వెంకటేష్, గుండు అశోక్,క్యామ మహేష్, శివశంకర్,నల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, పసిలోటి శ్రావణ్, సిహెచ్ కుమార్, కర్ణకోట అంజి, ప్రవీణ్ సింగ్, లింగారం సాయి, శ్రీనాథ్, అల్లాడ శ్రీను, గుండు అశోక్ ,శ్రీహరి, వంశీ, సాయి వంశీ, మంజునాథ్, మరియు హిందువాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో డీఎస్పీల ఇంటరాక్షన్





హైదరాబాద్ ,ప్రజాదర్బార్, మార్చ్ 26: ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లోని సెమినార్ హాల్--2లో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శిక్షణార్థులకు ప్రత్యేక గెస్ట్ లెక్చర్ ను రిటైర్డ్ డి జి పి అంజనీ కుమార్ ఐ పి ఎస్ తో నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్ నిర్ణయం మేరకు ప్రొబేషనరీ డి ఎస్ పి లకు సీనియర్ అధికారులతో ఇంటరాక్షన్ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ ఆంజనికుమార్ గారు హాజరై "అర్బన్ సొసైటీలో కమ్యూనలిజం మరియు లా ఒ ఆర్డర్ పై దాని ప్రభావం" అనే అంశంపై ప్రసంగించారు. గెస్ట్ అధికారిని శ్రీ మధుకర్ స్వామి, డిప్యూటీ డైరెక్టర్ (ఇండక్షన్) స్వాగతించి సభను ప్రారంభించారు. తన ప్రసంగంలో ఆంజనికుమార్ అర్బన్ సమాజంలో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ అధికారులు మంచి హృదయంతో పాటు సెక్యులర్ భావజాలంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడైనా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయని, చిన్న స్థాయి మత సంబంధిత వివాదాలను నిర్లక్ష్యం చేస్తే అవే పెద్ద మత కలహాలకు దారి తీసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయని హెచ్చరించారు. అలాగే, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలను సమర్థవంతంగా నిర్వహించడానికి కమ్యూనిటీ పాలిసింగ్ విధానాన్ని అమలు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవించడం, సమగ్ర సమాచారం వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రజలకు న్యాయం చేయగలమని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మధుకర్స్వామి, డి ఎస్ పి ఎన్ రామారావు అకాడమీ అధికారులు మరియు శిక్షణార్థులు పాల్గొన్నారు

# ఆంజనేయ స్వామికి అష్టోత్తర కలశాభిషేకం



యాదాద్రి(తుర్కపల్లి) మార్చి 26(ప్రజాదర్బార్)తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ ఆంజనేయస్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి మూలమంత్ర సహిత రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితుడు రమాకాంత్ శర్మ, ప్రేమ్ కిషోర్ పాండే ,సర్పంచ్ సోమల వెంకటేశం, ఆలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం సీతారాముల స్వామివారికి పంచామృత అభిషేకాలు, మధ్యాహ్నం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం ,రాత్రికి స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వామి వారి కళ్యాణం లో భక్తులందరూ సాంప్రదాయ దుస్తులతో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు

యాదాద్రి(మార్చి 26)వలిగొండ ప్రజాదర్బార్ న్యూస్: విద్యా ర్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందజేయాలని స్థానిక ఎంపిడిఓ జలందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని లోతుకుంట కస్తూరిభ బాలికల కళాశాల వసతి గృహం సందర్శించి హాజరు పట్టిక,స్థాక్ రిజిస్టర్ పరిశీలించి,సరుకుల నాన్యత పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి మాట్లాడుతూ విద్యార్థులకు నాన్యమైన రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందజేయాలని,విద్యుత్ సమస్యతో నీటి ఇబ్బందులను దృష్టికి తీసుకురావడంతో ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూసుకోవాలని తెలిపారు.



# అత్యాధునిక పి.ఓ.ఇ. ఎమ్ విధానంతో క్యాన్సర్ వ్యాధి బాధితుడికి ఉపశమనం

మిర్యాలగూడ మార్చి 26 (ప్రజా దర్బార్):-తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడికి అరుదైన రక్త క్యాన్సర్ అయిన అక్యూట్ ప్రోమైలోసిటిక్ లుకేమియా వ్యాధితో మలక్ పేట యశోద హాస్పిటల్ లో చేరినట్లు గురువారం మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారని జ్వరం రక్తస్రావ లక్షణాలతో ఆసుపత్రికి చేరిన యువకుడికి యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డా జి వంశీ కృష్ణ రెడ్డి కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ మరియు హీమాటో ఆంకాలజిస్ట్ సకాలంలో చికిత్స ప్రారంభించారు ఆధునిక వైద్య పరీక్షలతో వ్యాధిని నిర్ధారించి ఏటీఆర్ఏ మరియు ఆర్సెనిక్ ఆధారిత కెమోథెరపీ అందించారని అన్నారు రోగికి రక్తం ప్లేట్లెట్ మార్పిడి యాంటీబయోటిక్స్ యాంటీఫంగల్స్ అందించారు బహు శాఖల వైద్య బృందం సమన్వయంతో రోగిని నిరంతరం పర్యవేక్షించారు. చికిత్సకు రోగి మంచి స్పందన చూపడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది చివరకు రోగిని స్థిరమైన ఆరోగ్య స్థితిలో డిశ్చార్జ్ చేసి ఫాలోఅప్ కు సూచించారు. ఈ ఘటన యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలకు మరో ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ అన్ని బ్రాంచీల్లో అత్యాధునిక కేన్సర్ చికిత్స సదుపాయాలు నిపుణులైన వైద్య బృందాలు అందుబాటులో ఉండి అత్యవసర రక్త క్యాన్సర్ కేసులకు అత్యంత సమర్థవంతమైన చికిత్సను అందించగలమని యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మలక్‌పేట్ హైదరాబాద్ డైరెక్టర్ గొరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర ,ఎ వాసు కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

# పునరాభివృద్ధి పరిచిన పాఠశాల భవనం సంక్షేమ సౌకర్యాలను ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు వందన శ్రీవాత్సవ



## గురువారం విజయవాడ రైల్వే డివిజన్ సందర్శన



(ప్రజా దర్బార్ / విజయవాడ )అమృత్ స్టేషన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గురువారం విజయవాడ డివిజన్ లో దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు వందన శ్రీవాత్సవ పునరాభివృద్ధి చేయబడిన జాక్ అండ్ జిల్ (ఇంగ్లీష్ మీడియం) పాఠశాలను, సంక్షేమ సౌకర్యాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు వర్షా సోనాకియా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఇంకా ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం విజయవాడ డివిజన్ ఉపాధ్యక్షులు కొండ వినోద్ చందన, ఆ సంఘం కార్యదర్శి నిహారిక మానేరి, పాఠశాల కార్యదర్శి ఆర్ పవిత్ర, కోశాధికారి సింధూర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చిన్నారి విద్యార్థులకు అధునాతన సౌకర్యాల కల్పనతో పాటు వారు అహ్లాదకరంగా విద్యను అభ్యసించేందుకు అనువైన విధంగా పాఠశాల నిర్మాణాన్ని చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వందన శ్రీవాత్సవ క్యానిటరీ డిస్పోజల్ యూనిట్ను కూడా ప్రారంభించారు. ఈ సంఘం తరఫున విజయవాడ డివిజన్లోని 14 వేరు వేరు ప్రాంతాల కార్యాలయాలలోసానిటరీ డిస్పోజల్ యూనిట్లను మంజూరు చేశారు. ఈశీ సందర్భంగా వందన శ్రీవాత్సవ మాట్లాడుతూ రైల్వే పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా అత్యంత సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల భవనం తో పాటు పరిసరాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకునేలా వారిని ప్రోత్సహించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆ సంఘం ఉపాధ్యక్షులు వర్షా సోనాకియా మాట్లాడుతూ ఇలాంటి పాఠశాల నిర్మాణం దక్షిణ మధ్య రైల్వే జోన్ కి గర్వకారణం అన్నారు. అధునాతనమైన, అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో పాఠశాల భవనం నిర్మించి



విద్యార్థులకు అత్యంత ఆలాదకర వాతావరణం కల్పించడంలో దక్షిణ మధ్య రైల్వే కృతకృత్యులైనట్లు తెలిపారు. ఇలాంటి వాతావరణంలో ఉన్న పాఠశాలలో చదివే విద్యార్థులు తప్పనిసరిగా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు పాఠశాల ప్రాంగణంలో అలాగే డివిజన్లో కొత్తగా నిర్మించిన అనేక భవనాలనుజూ నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆమె పర్యటన సమాజ సంక్షేమం పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. అలాగే జ్య ఆరోగ్యం ఎంపవర్మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష......

## -లక్ష జరిమానా విధించిన కోర్టు.... ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు.

మెదక్ ప్రతినిధి, మార్చి 26:( ప్రజాదర్బార్ ) మహిళలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగిక దాడి కి పలుపడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్క ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు,జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిదని తెలిపారు.కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్



ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు. తూప్రాన్ ఎస్ ఐ గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడిఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు.ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యాదాద్రి(మార్చి 26)వలిగొండ ప్రజాదర్బార్ న్యూస్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి అన్నారు.గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భముగా ప్రత్యేక వైద్య బృందంచే ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు తేజశ్విని,శ్వేతా,వాసుదేవానంద్,కిరణ్,రేవంత్ వ్యాస్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

